అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో అడ్మిషన్లు ప్రారంభం

నిజామాబాద్ అర్బన్, జూలై 31: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ, పీజీ కోర్సులకు అడ్మిషన్లు ప్రారంభమైనట్లు ప్రాంతీయ సమన్వయకర్త రంజిత ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఆన్‌లైన్‌లో వెబ్‌సైట్ ద్వారా నమోదు చేసుకునే ముందు తప్పనిసరిగా గిరిరాజ్ కళాశాలలోని స్టడీ సెంటర్‌లో ఒరిజినల్స్‌తో పాటు ఆప్షనల్ కన్ఫర్మేషన్ కోసం సంప్రదించాలని ఆమె సూచించారు. యూజీ, పీజీ కోర్సుల్లో ప్రవేశానికి అర్హతను ధ్రువీకరించుకోవాలని ఆమె తెలిపారు. ఇతర వివరాలకు 9490609259 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.



మత్తడి దూకుతున్న సిర్నాపల్లి జానకీబాయి చెరువు అలుగు

మత్తడి దూకుతున్న సిర్నాపల్లి జలపాతం

ఇందల్వాయి, జూలై 31: తెలంగాణ నయాగరాగా ప్రసిద్ధిపొందిన సిర్నాపల్లి జలపాతం కలకళను సంతరించుకుంది. మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షాలతో సిర్నాపల్లి జానకీబాయి చెరువులోకి భారీ ఎత్తున వరద చేరి శీలం జానకీబాయి చెరువు పెద్ద ఎత్తున అలుగు పారుతోంది. దీంతో ప్రకృతి ప్రేమికులు ఈ జలధారను చూసేందుకు బారులు తీరారు. సిర్నాపల్లి జలపాతం చూసేందుకు బుధవారం ఉదయం నుంచే జిల్లా నలుమూలల నుంచి సందర్శకులు తరలివస్తున్నారు. సుమారు 32 ఫీట్ల ఎత్తునుంచి కిందికి జాలువారే జలపాతం అటవీప్రాంతంలో ఉండటంతో పక్షుల కిలకిల రాగాల నడుమ జలపాతం చూడ ముచ్చటగా ఉంటుందని ప్రకృతి ప్రేమికులు జలధారను చూసి పరవశించి పోతున్నారు. సిర్నాపల్లి జలధారతో పాటు గ్రామంలోని శీలం జానకీబాయి హయాంలో నిర్మించిన జానకీబాయి కోట, పురాతన ఆలయాలు గ్రామంలో ప్రసిద్ధిగాంచాయని వీటిని చూసేందుకు రాష్ట్రంలోని నలుమూలల నుంచి సందర్శకులు ప్రతీసంవత్సరం వస్తుంటారని గ్రామస్థులు తెలిపారు.



వరద ప్రవాహానికి తెగిపోయిన లింక్ రోడ్డు

కప్పల వాగుకు వరద ఉధృతి

సిరికొండ, జూలై 31: మండలంలోని కప్పల వాగు ప్రవహించడంతో రైతుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. మండలంలోని తూంపల్లి, కొండపూర్, పాకాల, పందిమడుగు అడవుల్లో బుధవారం కురిసిన భారీ వర్షానికి వాగులు ప్రవహించడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తూంపల్లి, కొండపూర్ గ్రామాల్లో భారీగా వర్షం కురువడంతో కప్పల వాగుకు వరద ఉధృతి పెరుగుతోంది. దీంతో వానాకాలం పంటల సాగుకు ఢోకా లేదని రైతులు అభిప్రాయపడుతున్నారు. అలాగే గడ్కోల్, కొండూర్, చిన్నవాల్గోట్ గ్రామాల పరిధిలో నిర్మించిన చెక్‌డ్యాంలు వరద నీటితో నిండి పోయాయి. వాగులపై మట్టితో తాత్కాలికంగా నిర్మించిన లింక్ రోడ్లు కొట్టుకు పోయాయి. దీంతో నిజామాబాద్, హొన్నాజిపేట్ వైపు రాకపోకలు నిలిచిపోయాయి.

• ప్రాజెక్టులో నీటి నిల్వ ఇలా..



శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు తగ్గిన వరద

మెండోర, జూలై 31: ఉత్తర తెలంగాణ జిల్లాను సస్యశ్యామలం చేస్తున్న శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు వరద ఉధృతి తగ్గింది. పది రోజులుగా ప్రాజెక్టు ఎగువ ప్రాంతాల్లో పరిసర ప్రాంతాల్లో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు ప్రాజెక్టులోకి భారీగా వరదనీరు వచ్చి చేరింది. అయితే రెండు రోజులుగా వర్షాలు తగ్గుముఖం పట్టడంతో ప్రాజెక్టులోకి 5518క్యూసెక్కుల వరద మాత్రమే వచ్చి చేరుతోందని ప్రాజెక్టు ఈఈ చక్రపాణి తెలిపారు. ఈ సందర్భంగా ప్రాజెక్టులోకి 12వేల క్యూసెక్కుల నీరు చేరగా మధ్యాహ్నం 8278 క్యూసెక్కులకు తగ్గింది. సాయంత్రానికి ప్రాజెక్టులోకి 5518 క్యూ సెక్కులకు చేరింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091.00 అడుగులు (80.5 టీఎంసీ)లు కాగా బుధవారం సాయంత్రానికి 1076.5 అడుగులు (36.269టీఎంసీ) నీటి నిల్వ ఉందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. ప్రాజెక్టులోకి జూన్ 1వ తేదీ నుంచి ప్రాజెక్టు ఎగువ ప్రాంతాల నుంచి 31టీఎంసీల వరదనీరు వచ్చిందని తెలిపారు.



శస్త్ర చికిత్స చేస్తున్న దృశ్యం

కుక్కలకు కు.ని. ఆపరేషన్లు

- శునకాల బెడద నియంత్రణకు నగర పాలక సంస్థ చర్యలు
- ఒక్కరోజే 35 కుక్కలకు కు.ని. ఆపరేషన్లు

సుభాష్‌నగర్, జూలై 31: నగరంలో కుక్కల బెడద తీవ్రంగా వేధిస్తుండటంతో నగర పాలక సంస్థ ఉన్నతాధికారులు కుక్కలను నియంత్రణలోకి తెచ్చేందుకు చర్యలు చేపట్టారు. కొద్దిరోజులుగా కుక్కలను కంట్రోల్ చేసే దిశగా ప్రయత్నాలు ముమ్మరం చేశారు. నగరంలోని పాత కలెక్టరేట్ వద్ద ఎనిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేసి అక్కడ కుక్కలకు కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు చేస్తున్నారు. హైదరాబాద్ నుంచి వెటర్నరీ డాక్టర్లను పిలిపించి కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయిస్తున్నారు. జూలై 17 నుంచి ఇప్పటి వరకు సుమారు 70 వరకు కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు నిర్వహించారు. బుధవారం ఒక్కరోజే 35 కు.ని. ఆపరేషన్లు నిర్వహించారు. వెటర్నరీ డాక్టర్లను ప్రైవేటు సంస్థకు అప్పచెప్పడంతో వారు హైదరాబాద్ నుంచి వచ్చి శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నారు. నగరంలోని పలు ప్రాంతాల్లో ప్రత్యేక బృందాలతో కుక్కలను పట్టుకొచ్చి ఏబీసీ సెంటర్‌లో కు.ని. శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నారు. బుధవారం నగరంలోని గౌతంనగర్‌తో పాటు దుబ్బ ప్రాంతాల్లో ఉన్న కుక్కలను ప్రత్యేక బృందాలతో పట్టుకొని తీసుకువచ్చి కు.ని. శస్త్రచికిత్సలు నిర్వహించారు.



కుక్కలను పడుతున్న దృశ్యం

యువ కళోత్సవ్ పోస్టర్ల ఆవిష్కరణ

నిజామాబాద్ అర్బన్, జూలై 31: నిజామాబాద్ జిల్లా డ్యాన్స్ అసోసియేషన్, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంయుక్తంగా ఈనెల 17న నిర్వహించనున్న యువ కళోత్సవ్-2024 (జిల్లాస్థాయి సాంస్కృతిక కార్యక్రమం) పోస్టర్లను బుధవారం ట్రస్మా జిల్లా అధ్యక్షుడు నిత్యానందం ఆవిష్కరించారు. కళలు, సంస్కృతి, సంప్రదాయాలు, దేశభక్తి నేటి యువతలో పెంపొందించేందుకు ఈ కార్యక్రమం నిర్వహించడం గొప్ప విషయమని ఇలాంటి కార్యక్రమాలకు ట్రస్మా మద్దతు ఎప్పుడు ఉంటుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా డ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆనంద్ బాబు, కార్యదర్శి సతీష్, సాయిబాబు, వినయ్, ప్రశాంత్, సిద్ధు, చందు, అంకుష్, రఘు, తదితరులు పాల్గొన్నారు.

• సీహెచ్ కొండూరు చెరువు



వానలు కురుస్తున్నా..
నిండని చెరువులు

- జిల్లాలోని పలు చెరువుల్లోకి చేరుకోని పూర్తిస్థాయి నీటి మట్టం
- పంటల సాగు పెరుగుతుండటంతో భారీగా భూగర్భ జలాల వినియోగం
- జిల్లాలో మొత్తం 996 చెరువులు

నిజామాబాద్, జూలై 31 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో వానాకాలం మొదలై రెండు నెలలు దాటినా ఇప్పటికీ మెజార్టీ చెరువులు నిండలేదు. జిల్లాలో సరాసరి సగటు వర్షపాతం కంటే ఎక్కువగానే పడినా ఫలితం లేదు. కొన్ని చెరువులు మినహాయిస్తే ఎక్కువ చెరువులు పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకోలేదు. జిల్లాలో ఇంకా పది శాతం చెరువులు కూడా మత్తడులు పడలేదు. భారీ వర్షాలు కురవక పోవడంతో అనుకున్న విధంగా చెరువుల్లో నీరు చేరలేదు. జిల్లాలో పదిరోజుల పాటు ఏకదాటిగా వానలు పడినా.. చెరువుల్లోకి అధికంగా నీరు చేరకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో బోర్ల ద్వారానే పంటల సాగును కొనసాగిస్తున్నారు.

జిల్లాలో ఇప్పటి వరకు 536.4 మి.మీ. వర్షం

జిల్లాలో జూన్ నుంచి ఇప్పటి వరకు 433.9 మిల్లీమీటర్ల వర్షం పడాల్సి ఉన్నా 536.4 మిల్లీమీటర్ల వర్షం పడింది. జిల్లాలో సగటు వర్షపాతం కంటే 102 మిల్లీమీటర్ల వర్షం ఎక్కువగా పడింది. జిల్లాలోని 18 మండలాల్లో సరాసరి సగటు వర్షపాతం కంటే ఎక్కువగా వర్షం పడింది. జిల్లాలోని 15 మండలాల్లో సరాసరి సగటు వర్షపాతం పడింది. అన్ని మండలాల పరిధిలో సగటు వర్షపాతం పడిన చెరువుల్లో నీళ్లు చేరలేదు. పది రోజుల పాటు వర్షం పడిన అనుకున్న విధంగా మాత్రం చెరువులకు నీళ్లు చేరకపోవడం వల్ల రైతులు బోర్లపైనే ఎక్కువగా ఆధారపడుతున్నారు. సాగు అంతా బోర్ల కిందనే చేస్తున్నారు.

జిల్లా వ్యాప్తంగా 996 చెరువులు

జిల్లాలో మొత్తం 996 చెరువులు ఉన్నాయి. వీటిలో కుంటలతో పాటు పెద్ద చెరువుల వరకు ఉన్నాయి. నిజామాబాద్ డివిజన్ పరిధిలో 324 చెరువులు ఉండగా బోధన్ డివిజన్ పరిధిలో 182, ఆర్మూర్ పరిధిలో 198, బాల్కొండ పరిధిలో 292 చెరువులు ఉన్నాయి. వీటిలో ఇప్పటి వరకు నీళ్లు చేరుతున్న మెజార్టీ చెరువులు ఇంకా నిండలేదు. నిజామాబాద్ డివిజన్ పరిధిలో 13 చెరువులు మాత్రమే పూర్తిస్థాయిలో నిండి మత్తడులు పడుతుండగా బోధన్ డివిజన్ పరిధిలో 31 చెరువులు మాత్రమే నిండాయి. ఆర్మూర్ డివిజన్ పరిధిలో కేవలం 16 చెరువులు నిండగా బాల్కొండ డివిజన్ పరిధిలో 15 చెరువులు మాత్రమే నిండి మత్తడులు పడుతున్నాయి. జిల్లాలో ఇప్పటి వరకు కేవలం 75 చెరువులు మాత్రమే పూర్తిస్థాయిలో నిండాయి. జిల్లాలో ఇప్పటి వరకు 363 చెరువుల్లో 75 శాతంకు పైగా వరద చేరగా, 233 చెరువుల్లో 75 శాతంలోపు నీళ్లు వచ్చాయి. జిల్లాలో 129 చెరువులు 50 శాతంలోపు నీళ్లు చేరగా 196 చెరువుల్లో కేవలం 25 శాతంలోపే నీళ్లు వచ్చాయి. వర్షం సరాసరి సగటుకంటే ఎక్కువగా పడిన జిల్లాలో మాత్రం చెరువుల్లోకి పెద్ద ఎత్తున వరద రాలేదు. చెరువులు నిండలేదు. సగటు వర్షపాతం కంటే ఎక్కువగా పడ్డ కనీసం సగం చెరువులు కూడా ఇప్పటి వరకు పూర్తిస్థాయిలో నిండలేదు. ఈ సంవత్సరం వర్షాలు ఆశాజనకంగా పడతాయని భావించిన రైతులు వరి సాగును ఎక్కువగా చేస్తున్నారు. వానాకాలం మొదలై రెండు నెలలు దాటినా ఇప్పటి వరకు పూర్తిస్థాయిలో చెరువులు నిండకపోవడం వల్ల రైతులు ఆందోళన చెందుతున్నారు. బోర్ల ఆధారంగానే ఎక్కువగా పంటల సాగు చేస్తున్నారు. వర్షాకాలం మరో రెండు నెలల పాటు ఉండటం వల్ల వచ్చే నెలల్లో ఎక్కువ మొత్తంలో వర్షాలు పడితే చెరువులు నిండుతాయని అంచనాకు వస్తున్నారు.

పెరుగుతున్న భూగర్భ జలాలు

జిల్లాలో సరాసరి సగటు వర్షపాతం పడటం వల్ల భూగర్భ నీటిమట్టాలు పెరుగుతున్నాయి. జిల్లాలో సరాసరి 10.55 మీటర్ల లోతులో ఉన్నాయి. జిల్లాలో అన్ని మండలాల పరిధిలో 82 ప్రాంతాల నుంచి సేకరించిన నీటిమట్టాల ఆధారంగా భూగర్భ జల శాఖ అధికారులు నిర్ధారించారు. జిల్లాలో మేలో 12.17 మీటర్ల లోతులో నీటిమట్టాలు ఉండగా జూన్‌లో అవి 13.19 మీటర్లకు చేరుకున్నాయి. వర్షాలు పడుతున్నా పంటల సాగు పెరగడం వల్ల భూగర్భ జల నీటివినియోగం పెరగడంతో నీటి మట్టాలు తగ్గాయి. జూలై నెల ఆరంభం నుంచి ఎక్కువ వర్షాలు పడటం వల్ల కొన్ని ప్రాంతాల్లో 7.61 మీటర్లలోనే నీటిమట్టాలు ఉన్నాయి. జిల్లాలోని భీంగల్, నవీపేట్, డిచ్‌పల్లి, ముప్కాల్ మండలాల పరిధిలో భూగర్భ జలాల తగ్గుదల ఎక్కువగా ఉంది.

భారీగా సాగునీటి వినియోగం

జిల్లాలో పంటల సాగు పెరగడం వల్ల భూగర్భ జలాల వినియోగం భారీగా పెరుగుతుంది. చెరువులు నిండకపోవడం, శ్రీరాంసాగర్ ప్రాజెక్టుల నుంచి నీటివిడుదల లేకపోవడం వల్ల ఎక్కువ మొత్తంలో నీటిని వినియోగిస్తున్నారు. జిల్లాలో ఉన్న లక్షా 75వేల బోర్లను వినియోగించడం వల్ల ఎక్కువ మొత్తంలో నీటిని తోడుతున్నారు. వర్షాలు పడుతున్న వరిసాగుకు ఎక్కువ మొత్తంలో నీళ్ల అవసరం ఉండటం, నాట్లు వేస్తుండటం వల్ల ఈ వినియోగం ఎక్కువగా ఉంది. వ్యవసాయానికి అవసరమైన విద్యుత్ కూడా సరఫరా అవుతుండటంతో రైతులు బోర్లను ఎక్కువగా వినియోగించి పంటలను వేస్తున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 4లక్షల 60 వేలకు పైగా పంటల సాగు చేశారు. దీనిలో 3లక్షల 10వేల ఎకరాల వరకు వరిసాగు చేశారు. వర్షాలు తగ్గడం వల్ల బోర్ల వినియోగం పెంచుతున్నారు. ప్రతీరోజు వ్యవసాయానికి 3.5 మిలియన్ల యూనిట్ల విద్యుత్‌ను వినియోగిస్తున్నారు. భారీ వర్షాలు పడితే రైతులు బోర్ల వినియోగం తగ్గించే అవకాశం ఉందని విద్యుత్ శాఖ అధికారులతో పాటు వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో 50 టీఎంసీలకు పైగా నీళ్లు వస్తే భూగర్భ జలాల వినియోగం తగ్గి ప్రాజెక్టు నీటిని వినియోగించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

కొట్టుకుపోయిన తాత్కాలిక రోడ్డు

ధర్పల్లి: మండలంలోని వాడి-మద్దుల్ తండా గ్రామాల మధ్య వాగుపై వేసిన తాత్కాలిక రోడ్డు కొట్టుకుపోవడంతో రాకపోకలు నిలిచాయి. ఎగువ ప్రాంతంలో కురిసిన భారీ వర్షంతో వాగులో నీటి ఉధృతికి తాత్కాలికంగా వేసిన మట్టిరోడ్డు కొట్టుకుపోవడంతో ధర్పల్లి-ఇందల్వాయి మండలాలకు రాకపోకలు నిలిచాయి. మట్టి రోడ్డును పునరుద్ధరించి రాకపోకలను కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు అధికారులను కోరుతున్నారు.



నిజామాబాద్ జిల్లా మత్స్యశాఖాధికారిగా ఆంజనేయస్వామి నియామకం



నిజామాబాద్ రూరల్, జూలై 31 : జిల్లా మత్స్యశాఖ అధికారిగా ఆంజనేయస్వామి బాధ్యతలు చేపట్టారు. ఖమ్మం ఎఫ్‌డీవోగా విధులు నిర్వహిస్తున్న ఆంజనేయస్వామి బదిలీపై జిల్లాకు వచ్చారు. ఆయన సోమవారం బాధ్యతలు చేపట్టినట్లు తెలిపారు. జిల్లా మత్స్యశాఖ అధికారిగా విధులు నిర్వహించిన రాజనర్సింహను ఖమ్మం జిల్లాకు బదిలీచేశారు. ఆంజనేయస్వామి గతంలో ఎఫ్‌డీవోగా రెండేళ్ల విధులు నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని అర్సపల్లి మత్స్యశాఖ కార్యాలయ భూములను కాపాడటంలో ప్రధానపాత్ర పోషించారు. ఫిషరీష్ డెవలప్‌మెంట్ లాండ్ కబ్జాదారులపై హైకోర్టులో కేసువేశారు.

ప్రమాదకరంగా మారిన నాగన్‌పల్లి బ్రిడ్జి

● శిథిలావస్థలో బ్రిడ్జి ● బ్రిడ్జి సైడ్‌వాల్స్ కూలి వాహనదారులకు ఇబ్బందులు



బ్రిడ్జిపై ఏర్పడిన గుంతలు



బ్రిడ్జికి ఇరువైపులా ఏర్పడిన గుంతల్లోనే ప్రయాణాలు చేస్తున్న దృశ్యం

బోధన్‌రూరల్,జూలై31: బోధన్ పట్టణ సరిహద్దు నాగన్‌పల్లి బ్రిడ్జి పై, ఇరువైపులా భారీ గుంతలు ఏర్పడ్డాయి. నాగన్‌పల్లి బ్రిడ్జి ప్రమాదకరంగా మారింది. ఇటీవల కురిసిన వర్షాలకు బ్రిడ్జి శిథిలావస్థ దశకు చేరినట్లయింది. బ్రిడ్జి కింద, పైనుండి వర్షపు నీరు పారింది. బ్రిడ్జి పై ఉన్న సైడ్‌వాల్స్ కొన్ని కూలిపోవడంతో ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు. బ్రిడ్జికి బోధన్ వైపు, నాగన్‌పల్లి వైపు ప్రధానంగా పెద్ద గుంతలు ఏర్పడడంతో వర్షపు నీరు నిలిచి గుంతలు కనబడక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తరుచు ప్రమాదాలు సైతం జరుగుతున్నాయి. సంబంధిత అధికారుల నిర్లక్ష్యం వల్లనే ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని నాగన్‌పల్లి వాసులు, ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బ్రిడ్జికి ఇరువైపులా పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డ సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం వారి నిర్లక్ష్యానికి నిదర్శనంగా మారింది. తక్షణమే బ్రిడ్జిపై, బ్రిడ్జికి ఇరువైపులా ఏర్పడ్డ గుంతలను పూడ్చాలని, ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా సంబంధిత అధికారులు చూడాలని ప్రజలు కోరుతున్నారు. రాత్రిపూట సాలూర, మహారాష్ట్ర వైపు వెళ్లేవారు గుంతల లోతు తెలియక గుంతల్లో పడి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రాత్రిపూట తరుచు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని నాగన్‌పల్లి వాసులు, వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైన సంబంధిత అధికారులు కాలక్షేపం చేయకుండా బ్రిడ్జిపై ఉన్న గుంతలను పూడ్చి వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

బోధన్ నుంచి సాలూర వెళ్లాలంటే భయంగా ఉంది



బోదన్ పట్టణం నుండి ఇటీవల కురిసిన వర్షలతో నాగన్‌పల్లి బ్రిడ్జిపై ఏర్పడ్డ గుంతల వల్ల తమ స్వగ్రామం సాలూర వెళ్లాలంటే నరకయాతన పడాల్సి వస్తుంది. రోడ్డుపై ఏర్పడ్డ గుంతలను మొరం, కంకర పౌడర్‌తో నింపకపోవడంతో తరుచు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇకనైన అధికారులు స్పందించి గుంతలను పూడ్చాలి.

-పాండు, సాలూర గ్రామస్థుడు

బ్రిడ్జిపై ఉన్న గుంతలను వెంటనే పూడ్చాలి



నాగన్‌పల్లి బ్రిడ్జిపై, రోడ్డుకు ఇరువైపులా ఏర్పడ్డ గుంతలను వెంటనే పూడ్చాలి. సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వీడి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలి. లేనట్లయితే ఆందోళన చేపడతాం

- వరదయ్య, వాహనదారుడు,బోధన్

ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని వినతి



పొతంగల్ తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న రైతులు

కోటగిరి,జూలై31: పొతంగల్ మంజీర నది నుంచి ఇసుక రవాణా అక్రమ రవాణాను అరికట్టాలని రైతులు డిమాండ్ చేశారు. పొతంగల్ తహసీల్దార్ కార్యాలయంలో ఆర్‌ఐ సాయిలు బుధవారం ఈ విషయమై వినతిపత్రం సమర్పించారు. మంజీర నది నుంచి రాత్రి, పగలు తేడా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నారని రైతులు ఆరోపించారు. రాత్రివేళ లారీలు, టిప్పర్‌లతో ఇసుకను తరలిస్తున్నారని పేర్కొన్నారు. పొతంగల్ మంజీర నది నుంచి మహారాష్ట్రకు ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని ఫిర్యాదు చేశారు. ఇసుక అక్రమ రవాణాతో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్లు దెబ్బతింటున్నాయని ఇప్పటికైనా అధికారులు ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పవన్, మాణిక్ అప్పు,బండారి గంగారాం, మనోహ్మన్ దేశాయ్,విఠల్, దత్తు, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

విరాధ్య విశ్వం చిత్ర టైటిల్ పోస్టర్ల ఆవిష్కరణ



చిత్రం షూటింగ్‌లోని దృశ్యం

బోధన్‌రూరల్,జూలై31: టీఎస్‌ఆర్ ఆర్ట్స్ ప్రొడక్షన్, క్రియేటివ్ డ్రీమ్ ప్రొడక్షన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న విరాధ్య విశ్వం ఇండిపెండెంట్ చిత్ర టైటిల్ పోస్టర్లను చిత్ర యూనిట్ సభ్యులు బుధవారం సాలంపాడ్ క్యాంప్‌లో ఆవిష్కరించారు. ఈ సినిమాకు సాలంపాడ్ క్యాంప్ గ్రామానికి చెందిన తూము నవీన్ రెడ్డి రచన, దర్శకత్వం వహిస్తున్నారు. తిరుమలేష్, దీపారాథోడ్‌తో పాటు కిరణ్ దాచేపల్లి, అకివీడు శివ తదితరులు చిత్రంలో కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రానికి సన్నీ మెల్చిజెడెక్ సంగీతం అందించారు. కొత్త కదాంశంతో నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని అతి త్వరలో ఓటీటీలో విడుదల చేస్తున్నట్లు దర్శకుడు నవీన్ రెడ్డి తెలిపారు. నిర్మాతలుగా తూము విష్ణువర్ధన్ రెడ్డి, యడ్ల నిరంజన్ రెడ్డి, బిజ్జం విష్ణువర్ధన్ రెడ్డి, వీరంరెడ్డి అశోక్ రెడ్డి వ్యవహరిస్తున్నారు. పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులు శ్రీహర్ష, ప్రసన్న, తదితరులు పాల్గొన్నారు.

అమీర్‌నగర్ గ్రామస్థుల ధర్నా

కమ్మర్‌పల్లి, జూలై 31: మండంలోని అమీర్‌నగర్ గ్రామ శివారులోని సర్వే నెంబర్ 73 లో ని అసైండ్ భూముల్లో స్థానికులకు (గత కొంతకాలంగా కబ్జాలో ఉన్న) కాకుండా అప్పటి అధికారులు స్థానికేతరులకు పట్టాలు ఇవ్వడం పట్ల ఆగ్రహంవ్యక్తం చేసిన గ్రామస్తులు పట్టాలు రద్దుచేయాలని డిమాండ్ చేస్తు కమ్మర్‌పల్లి తహసీల్దార్ కార్యాలయంముందు బైటాయించి ధర్నా చేపట్టారు. 73 సర్వే నెంబర్‌లోని అసైండ్ భూమిలో తమ గ్రామస్తులు గత 30 సంవత్సరాలుగా ఐదుగురు రైతులు కబ్జాలో ఉండి వ్యవసాయం చసుక్తుఉన్నారని ఈదే సర్వే నెంబర్‌లోగల కొంత భూమి శివగుట్ట శివాలయం ఆధినంలో ఉండగా దానిపై వచ్చే ఆదా యాన్ని శివాలయానికి వినియోగిస్తున్నామన్నారు. ఈ విషయమై ఆర్మూర్ ఆర్డీవో కు వినతిపత్రాన్ని అందచేశారు. గతంలో జారి చేసిన పట్టాలు రద్దుచేయడం కుదరదని భూమివిషయమై పరస్పరం కోర్టుకు వెల్లినందున తామేమి చేయలేమని ఇంజక్షన్ ఆర్డర్‌తెచ్చుకోవాలని ఆర్డీవో అన్నారు. అంతకుముందు తహసీల్దార్ అంజనేయులుతో గ్రామస్తులు వాదనకు దిగారు.

మోతెలో 235మంది విద్యార్థులకు షూల వితరణ

వేల్పూర్, జూలై31: వేల్పూర్ మండలం మోతె గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 235మంది విద్యార్థులకు షూలను ఇదే గ్రామానికి చెందిన పూర్వవిద్యార్థి ఎస్‌బీఐ కామారెడ్డి బ్రాంచ్ మేనేజర్‌గా విధులు ఇస్సాపల్లి రవి వితరణ చేశారు. బుధవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన సందర్భంగా జిల్లా రెడ్‌క్రాస్ వైస్ చైర్మన్ డొల్ల రాజేశ్వర్, రవి ఆయన స్నేహితుల చేతుల మీదుగా విద్యార్థులకు 235జతల షూలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వైద్య గణేష్, ఉపాధ్యాయులు రత్నయ్య, శ్రావణశ్రీ, కవిత,మంచిర్యాల సురేష్‌కుమార్, విద్యార్థులు, ఉన్నారు

తహసీల్దార్‌కు రేషన్ డీలర్ల సన్మానం

ఏర్గట్ల, జూలై 31: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఇటీవలే బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్ శ్రీలతను మండలంలోని రేషన్ డీలర్లు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పిట్ల మీనా నరేష్, రహమాన్, అశోక్, శ్రీనివాస్, గంగాధర్, గంగశంకర్, మనసిని, రమారాణి అరుణలు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

ముప్కాల్, జూలై31: తెలంగాణ రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డి రూ.లక్ష 50వేల రుణమాఫీ నేరుగా రైతు ఖాతాల్లో జమ చేయడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన రైతు రుణమాఫీ హామీ నెరవేరడంతో బుధవారం ముప్కాల్ మండల కేంద్రంలో ఎస్సీకాలనీలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు, రుణమాఫీ లబ్ధిదారులకు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే రైతులకు అభివృద్ధి చేయడానికి మరిన్ని సంక్షేమ పథకాలు సీఎం రేవంత్ రెడ్డి అమలు చేయడానికి సిద్ధంగా ఉన్నారని, ఇచ్చిన హామీ మేరకు దశలవారీగా రూ.2లక్షల రుణమాఫీ జరుగుతుందని కాం గ్రెస్ పార్టీ టౌన్ ఇన్‌ఛార్జీ ముస్కు మోహన్ అన్నారు. ఈకార్యక్రమంలో మాజీసర్పంచ్ కాంగ్రెస్ నాయకులు కొమ్ముల శ్రీనివాస్, ఏలేటి రాజు, ముస్కుముత్తెన్న, ప్రశాంత్, మల్లారెడ్డి, సదా, గద్దల గంగాధర్, లాలయ్య, కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులను నిర్వహించాలి

ముప్కాల్, జూలై31: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా నివారణలో భాగంగా గ్రామాల్లో పారిశుధ్య పనులను నిరంతరం సక్రమంగా నిర్వహించాలని ఎంపీడీవో మహమ్మద్‌గౌస్ గ్రామ కార్యదర్శులను ఆదేశించారు. బుధవారం ముప్కాల్ మండలంలోని నల్లూర్ గ్రామంలో పారిశుధ్య పనులను ఆయన పరిశీలించారు. అనంతరం డంపింగ్‌యార్డు, వైకుంఠధామం, పల్లెప్రకృతి వనం, తదితర ప్రాంతాలను పరిశీలించారు. పంచాయతీ రిజిస్టర్‌లను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమలో నల్లూర్ సెక్రెటరీ విగ్నేష్, ఫీల్డ్‌అసిస్టెంట్ భూమేష్, తదితరులు పాల్గొన్నారు.

వీక్లీ మార్కెట్ శుభ్రతకు చర్యలు

వర్ని,జూలై31: వర్ని మండల కేంద్రంలో బుధవారం వారంతపు సంత శుభ్రతకు అధికారులు చర్యలు చేపట్టారు. సంత ఆవరణ అపరిశుభ్రంగా మారడంతో ఎంపీవో మారుతీ, కార్యదర్శి సాయిలు ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికులతో శుభ్రం చేయించారు. బురదను తొలగించి పిచ్చి మొక్కలను ఏరివేశారు. వచ్చే వారం తపు సంతలోగా పరిసరాల పరిశుభ్రతకు చర్యలు చేపట్టినట్లు ఎంపీవో మారుతీ తెలిపారు.

వనమహోత్సంలో మొక్కలు నాటిన ఎస్సై

ఏర్గట్ల,జూలై 31:వనమహోత్సంలో భాగంగా బుధవారం మండల కేంద్రంలోని హయగ్రీవ పాఠశాలలో ఎస్సై మచ్చేందర్ రెడ్డి మెక్కలు నాటారు.ఈసందర్భంగా పాఠశాలలో వన మహోత్స వం కార్యక్రమాన్ని నిర్వహించినట్లు సెక్రటరీ, కరస్పాండెంట్ అలి వేణి తెలిపారు.ఈకార్యక్రమంలోఉపాధ్యాయలు,విద్యార్థులు పాల్గొన్నారు.

రెండు ఆలయాల్లో చోరీ

ఎడపల్లి, జూలై31: ఎడపల్లి మండలంలోని ఏఆర్పీ క్యాంపు గ్రామంలోని రామాలయంలో, బాపూనగర్ గ్రామంలోని సాయిబాబా అలయాలలో మంగళవారం రాత్రి వరుస చోరీలు జరిగినట్లు ఎడపల్లి ఎస్సై వంశీ కృష్ణారెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ఏఆర్పీ క్యాంపు గ్రామంలోని రామాలయంలో, బాపూనగర్ గ్రామంలోని సాయిబాబా ఆలయాలకు ఉదయం పూజారిలు వెళ్లి చూసేసరికి ఆలయాలలోని హుండీలు పగుల గొట్టి ఉండడంతో వారు గ్రామస్థులకు సమాచారం అందించారు. దీంతో గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటనా స్థలాలకు చేరుకుని, క్లూస్‌టీంద్వారా వివరాలను సేకరించారు. ఏఆర్పీ గ్రామంలోని రామాలయంలో రెండు వేల నగదు, బాపూనగర్ సాయిబాబా ఆలయంలో మూడు వేల నగదుతో పాటు వెండి వస్తువులను దొంగలు దొంగిలించినట్లు ఆయన తెలిపారు. ఆలయ కమిటీ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

'అరకొర జీతాలతో పస్తులుంటున్నాం'

ఆర్మూర్‌టౌన్ జూలై31: సంచార పశువైద్య వాహనసేవలో అందించే సిబ్బంది అరకొర జీతాలతో పస్తులు ఉంటున్నామని డాక్టర్ కాంతయ్య, అరుణ్‌కుమార్, డ్రైవర్ ప్రేమ్‌లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అంకిత భావంతో 1962సంచార పశువైద్య వాహన సేవలో సేవలందిస్తున్న తమకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడిగా పని చేస్తున్న వైద్యులకు రూ.35వేలు, అసిస్టెంట్‌కు రూ.14వేలు, డ్రైవర్‌కు రూ.8వేలు మాత్రమే చెల్లిస్తున్నారని, కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం వైద్యునికి రూ.56 వేలు, అసిస్టెంట్ రూ.20వేలు, డ్రైవ్‌కు రూ.18వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రతీసంవత్సరం పది శాతం ఇంక్రి మెంట్లు ఇవ్వడంలేదని, గత రెండు నెలలుగా జీతాలు సైతం రావడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక చర్యలు చేపట్టాలి

నవీపేట,జూలై31: గ్రామాలలో పారిశుధ్య నిర్వహణ పట్ల ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎంపీడీవో నాగనాథ్ కోరారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పలు చోట్ల గుంతలలో నీరు నిలిచి ఉన్నాయని వెంటనే అటువంటి వాటిని తొలగించాలని సూచించారు. వన మహోత్సవం సందర్భంగా ఖాళీ స్థలాలలో మొక్కలు నాటాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

నవీపేట,జూలై31: మండల కేంద్రానికి చెందిన 17సంవత్సరాల బాలిక అదృశ్యమైందని ఎస్ఐ యాదగిరి గౌడ్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని జూనియర్ కళాశాల హస్టల్‌కు బుధవారం ఉదయం వెళ్లాల్సి ఉండగా బయటకు వెళ్లిన ఆమె తిరిగి ఇంటికి చేరుకోలేదని అన్నారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నవీపేటలో ఒకరి ఆత్మహత్యా యత్నం

నవీపేట,జూలై31: మండలంలోని ఒక గ్రామానికి చెందిన వ్యక్తి తమకు న్యాయం చేయాలని కోరుతూ బుధవారం సాయంత్రం మండల కేంద్రంలో రైలు పట్టాలపై పడుకుని ఆత్మహత్య యత్నానికి యత్నించాడు. నాలుగు మాసాల క్రితం మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువకుడు తన 17సంవత్సరాల కూతురును కిడ్నాప్ చేయడంతో అతనిపై ఫోక్సో కేసు నమోదు అయిందని అన్నారు. ఈ విషయంలో తమ కుటుంబానికి ప్రభుత్వం తరపున తగిన న్యాయం చేయాలని కోరుతూ ఆయన రైలు పట్టాలపై పడుకున్నాడు. దీంతో పోలీసులు అతనికి నచ్చజెప్పడంతో శాంతించాడు.

టీచర్‌ని సస్పెండ్ చేయడం హేయమైన చర్య

ముప్కాల్,జూలై31:ఇటీవల ఖమ్మం జిల్లాలో శిరీష అనే ఉపాధ్యాయురాలిని సస్పెండ్ చేయడం హేయమైన చర్యలని తాపస్ జిల్లా అధ్యక్షురాలు కృష్ణవేణి బుధవారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. విద్యార్థుల తలవెంట్రుకలు, వేషాధారణ సరిగ్గా లేదని గమనించిన ఉపాధ్యాయురాలు అనేక మార్లు మందలించిన వినిపించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన విద్యార్థులను సంస్కరించే ప్రయత్నంలో భాగంగా హెయిర్ కాటింగ్ చేయించిన కారణంగా శిరీష అనే ఉపాధ్యాయురాలిని సస్పెండ్ చేయడాన్ని ప్రతీ ఒక్కరు ఖండించాల్సిన అవసరం ఉంది. రోజురోజు విద్యార్థుల్లో పెరుగుతున్న దురలవాట్లు, నిర్లక్ష్య వైఖరి వల్ల భావి సమాజం, క్రమ శిక్షణరాహిత్యమవుతుందన్నారు.అంకితభావం, తత్పరత కలిగి బావి సమాజాన్ని సంస్కరించాలనే విశాల దృక్పధంతో ముందుకు వెళ్లి సీఎంచే ప్రశంసాలు అందుకున్న ఉపాధ్యాయురాలిని సస్పెండ్ చేయడం పట్ల ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.ఉపాధ్యాయుల ఆత్మస్థైర్యంపై మీద దెబ్బతీయడం అత్యంత అమానుషచర్య కబట్టి ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా శిరీష ఉపాధ్యాయురాలిని సస్పెండ్ ఎత్తివేసి గౌరవ ప్రధంగా విధుల్లో చేర్చుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.

గాయపడ్డ వ్యక్తికి 25వేల జరిమాన ఇవ్వాలని తీర్పు

● బోధన్ కోర్టు అసిస్టెంట్ సెషన్ న్యాయాధికారి దేవన్ అజయ్‌కుమార్ వెల్లడి

బోధన్‌రూరల్,జూలై31: బోధన్ కోర్టులో బుధవారం దాడి కేసులో గాయపడ్డ వ్యక్తికి రూ.25వేల నష్టపరిహారం ఇవ్వాలని బోధన్ కోర్టు అసిస్టెంట్ సెషన్ న్యాయాధికారి దేవన్ అజయ్‌కుమార్ తీర్పు వెల్లడించారు. కోర్టు పోలీసులు తెలిపిన వివరాలప్రకారం కోటగిరి మండలం కారేగాం గ్రామానికి చెందిన యాదవరావు, రమేష్ అనే ఇద్దరు కుటుంబాల పిల్లలు గొడవ పడగా అది పెద్దదై 12-11-2023నాడు రమేష్ అనే వ్యక్తి యాదవరావు అనే వ్యక్తికి దాడికి యత్నించాడని ఫిర్యాదులో పేర్కొనగా పోలీసుల తరపున డాక్టర్ సమ్మయ్య బుధవారం విచారణ పూర్తిచేశాడు. ఈసందర్భంగా దాడికి పాల్పడిన వ్యక్తి గాయపడిన వ్యక్తికి రూ.25వేల నష్టపరిహారం అందించాలని కోర్టు తీర్పులో వెల్లడించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సబ్ ఇన్‌స్పెక్టర్ సందీప్, రుద్రూర్ సీఐ జయేష్ రెడ్డి, ఏసీపీ శ్రీనివాస్, బోధన్ కోర్టు లైజింగ్ అధికారి శంకర్, బాకర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కోటగిరి,జూలై31: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా నాయకులు దుబాస్ రాములు డిమాండ్ చేశారు. కోటగిరి తహసీల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం ఏఐఈయూసీ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన కార్మికులు ధర్నా నిర్వహించారు చలో హైదరాబాద్ కార్యక్రమం చేపడితే ఏఐటీయూసీ నాయకులను అక్రమంగా అరెస్టు చేయడం సరికాదని వారిని తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూ నాయకులు విఠల్‌గౌడ్, అలీ, వీరేశం, ఉషా, సరిత, సత్యావతి, నాగమణి, రమణమ్మ, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

హోటళ్లు, టిఫిన్ సెంటర్‌ల తనిఖీలు

ఆర్మూర్‌టౌన్ ,జూలై31: మున్సిపల్ పరిధిలోని పలు హోటళ్లు, టిఫిన్ సెంటర్‌లలో బుధవారం మున్సిపల్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ రాజు, చైర్‌పర్సన్ వన్నెల్‌దేవి లావణ్య ఆదేశాల మేరకు మున్సిపల్ అధికారులు హోటళ్లు, టిఫిన్ సెంటర్‌ల పరిశుభ్రతపై తనిఖీలు నిర్వహించిఅలాగే హోటళ్లలో పట్టుబడ్డ ప్లాస్టిక్‌ను సీజ్ చేసి రూ.12వేల 500జరిమానాను విధించారు. ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్‌స్పెక్టర్ గజానంద్, పర్యావరణ ఇంజనీర్ పూర్ణమౌళి, మున్సిపల్ సిబ్బంది అక్షయ్, నరేష్, సంతోష్, తదితరులు పలాబ్గన్నారు.

భీమ్‌గల్‌లో భారీ చోరీ

భీమ్‌గల్ రూరల్, జూలై31: భీమ్‌గల్ పట్టణంలో మంగళవారం అర్థరాత్రి బోయి గల్లీలో భారీ దొంగతనం జరిగింది. పట్టణ కేంద్రానికి చెందిన ప్రముఖ రియల్ ఎస్టేట్ వ్యాపారి పోత్నాల శ్రీనివాస్ ఇంట్లో అర్థరాత్రి దొంగలు చొరబడి సుమారు ముడున్నర తులాల బంగారం, 45తులాల వెండిని దొంగతనం చేశారు. గుట్టు చప్పుడు కాకుండా ఇంట్లోకి చొరబడి బీరువా తాళాలను పగులగొట్ట అందులోని బంగారాన్ని,వెండిని దొంగిలించారు.చోరీకి పాల్పడ్డ వ్యక్తులు చాకచక్యంగా చుట్టు పక్కల ఇంటి పరసర ప్రాంతాల ఇళ్లకు ఉన్న గొళ్లలను పెట్టి మూసి వేశారు. అనంతరం ఇంట్లోకి చొరబడి దొంగతనం చేశారు. ఉదయం6గంటల ప్రాంతంలో ఇంటి యాజమాని శ్రీనివాస్ బయటకు వచ్చి చూడగా పక్కగదిలోని ఇంటి తాళలు పగులగొట్టి ఉండడం గమనించి స్థానిక పోలీసులకు సమాచారం అందించారు.వెంటనే పోలీసులు క్లూస్‌టీంను తర్పించారు. క్లూస్‌టీం బృందం సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. త్వరలోనే దొంగలను పట్టుకుంటామని ఎస్సై హరిబాబు తెలిపారు.

పాఠశాల ఆవరణంలో పిచ్చిమొక్కల తొలగింపు



పిచ్చి మొక్కలపై గడ్డి మందు పిచికారీ చేస్తున్న దృశ్యం

మోస్రా,జూలై31: పాఠశాలలో పలు సమస్యలపై బుధవారం ప్రచురించిన మోస్రా మండల పాఠశాలల్లో సమస్యలెన్నో కథనానికి అధికారులు స్పందించి పాఠశాలల్లో మురికి కాలువలను శుభ్రం చేశారు. చింతకుంట జిల్లా పరిషత్ పాఠశాలలో పిచ్చి మొక్కలకు గడ్డిమందు కొట్టారు. పిట్ల గంగాధర్ కాలనీ పాఠశాల వద్ద ముందు ఉన్న మురికి కాలువలు నీరు నిలవకుండా కాలువ తీశారు. కానీ పాఠశాల వెనుకల ఉన్న డ్రైనేజీ పిచ్చి మొక్కలు కానీ శుభ్రం చేయలేదు. వాటిని గురువారం నాడు జేసీబీ సహాయంతో శుభ్రం చేస్తామని ఎంపీవో వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది కాశీరామ్, శ్రావణ్, జిన్నా రాము, గ్రామ పంచాయతీ సఫాయి సిబ్బంది పాల్గొన్నారు. ప్రధానోపాధ్యాయులు మధుసూదన్, శోభాబాయి పాఠశాలలో శుభ్రం చేయడంతో చాలా సంతోషంగా ఉంది. మట్టి కుప్పలు, చెత్త, పిచ్చి మొక్కలు తొలగించడంతో పాఠశాల వాతావరణం శుభ్రంగా ఉందని సంతోషం వ్యక్తం చేశారు.

నేటి నుంచి తల్లిపాల వారోత్సవాలు

డిచ్‌పల్లి,జూలై 31: మండలంలోని అన్ని అంగన్ వాడీ కేంద్రాల్లో ఈ నెల 1నుంచి 7వరకు తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించాలని అండన్‌వాడీ సూపర్ వైజర్ బుజ్జి తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రంలోకి వచ్చే చిన్నారులకు తల్లి పాల వారోత్సవాల పట్ల కలిగే లాభాలపై తల్లిదండ్రులకు వివరించాలని కోరారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్లు ఈ కార్యక్రమాన్ని విధిగా నిర్వర్తించి లక్ష్యాలను గర్భిణులకు వివరించాలన్నారు.

రుద్రూరు: మండలంలో నేటి నుంచి తల్లిపాల వారోత్సవాలు జరగనున్నట్లు సూపర్ వైజర్ శ్రీలత తెలిపారు. మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రతీ ఏడాది ఆగస్టు 1వ తేదీ నుంచి తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది వారోత్సవాలకు సంబంధించిన కార్యక్రమం గురువారం నుంచి ప్రారంభమవుతుందని ఐసీడీఎస్ సూపర్ వైజర్ తెలిపారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో సౌకర్యాలు కల్పించాలి



మాట్లాడుతున్న పార్లమెంటరీ అధ్యక్షుడు దేగాం యాదాగౌడ్

సుభాష్‌నగర్, జూలై 31: ప్రభుత్వ ఆసుపత్రిలో కనీస సౌకర్యాలు కల్పించాలని టీడీపీ నిజామాబాద్ పార్లమెంటరీ అధ్యక్షుడు దేగాం యాదాగౌడ్ అన్నారు.నగరంలోని టీడీపీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు సౌకర్యాలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. స్థానికంగా ఉండే ప్రజాప్రతినిధులు, అధికారులు తమ నియోజకవర్గాల్లో ఉండే ప్రభుత్వ ఆసుపత్రులను సందర్శించి సౌకర్యాల గురించి ఆరా తీయాలన్నారు. ప్రతీసంవత్సరం ఆసుపత్రులకు కోట్ల రూపాయల నిధులు వస్తున్నా ఆసుపత్రులు అభివృద్ధి కావడం లేదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులు ఏమవుతున్నాయని మండిపడుతున్నారు. గత కొన్ని రోజుల క్రితం నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఆరోగ్యశ్రీలో సుమారు 9కోట్ల కుంభకోణం జరిగినట్లు పలు సామాజిక మాధ్యమాల్లో వచ్చాయని ఇప్పటి వరకు 9కోట్ల కుంభకోణంపై ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న దృశ్యా ప్రభుత్వ ఆసుపత్రిలో పరిశుభ్రత లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారని అందుబాటులో డాక్టర్లు లేక ప్రైవేటు ఆసుపత్రికి వెళ్తున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వీటిపై దృష్టిసారించి ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్యం అందేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షుడు అంబిక సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

లిఫ్ట్ ఇరిగేషన్ కార్మికుల పోరాటం వాయిదా



చర్చలో మాట్లాడుతున్న అధికారులు

పెద్దబజార్, జూలై 31: లిఫ్ట్ ఇరిగేషన్ కార్మికుల పోరాటం తాత్కాలికంగా వాయిదా వేయడం జరిగిందని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు తెలిపారు. బుధవారం నగరంలోని లేబర్ కార్యాలయంలో లేబర్ కమీషనర్ యోహన్‌తో కార్మికుల చర్చలు ఒప్పందంలో కుదరక రెండు రోజులు వాయిదా వేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా రమేష్‌బాబు మాట్లాడుతూ మూడు నెలల వేతనాల కోసం భవిష్యత్తులో తీసుకునే నిర్ణయం మేరకు పోరాటాన్ని కొనసాగించాలని నిర్ణయించడం జరిగిందన్నారు. తిరిగి వచ్చేనెల 13 నుంచి చర్చలకు నిర్ణయించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ అధికారులు ఏఈ రాజ్‌కుమార్, కార్మిక నాయకులు గణేష్, కార్తిక్, సందీప్, బుచ్చన్న, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సుకు తప్పిన పెను ప్రమాదం

● 72మంది ప్రయాణికులు సురక్షితం



పోచంపాడ్ ఎక్స్‌రోడ్డు వద్ద డివైడర్ ఎక్కిన ఆర్టీసీ బస్సు

మెండోర, జూలై31: నిజామాబాద్-2 డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు నిర్మల్ వైపు వెళ్తుండగా 44వ జాతీయరహదారి పోచంపాడ్ ఎక్స్‌రోడ్డు వద్ద అదుపుతప్పి డివైడర్ ఎక్కించడంతో బస్సులో ఉన్న ప్రయాణికులు క్షేమంగా బయటపడ్డారు. ఈ సందర్భంగా బస్సులో ఉన్న కండెక్టర్ తెలిపిన వివరాల పరకారం డ్రైవర్ పశువులను తప్పించబోయి డివైడర్ ఎక్కించినట్లు తెలిపారు. బస్సులో 72మంది ప్రయాణికులు ఉన్నారని ప్రయాణికులకు ఏటువంటి ప్రమాదం జరగలేదన్నారు. ప్రయాణికులను వేరే ఆర్టీసీ బస్సులో వారి గమ్యస్థానాలకు చేర్చినట్లు తెలిపారు.

ప్రతీ రైతుకు రుణమాఫీ అందేలా చూడాలి



ఇందల్వాయిలో తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

ఇందల్వాయి, జూలై 31: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అందిస్తున్న రెండులక్షలలోపు రుణమాఫీ మండలంలోని అర్హులైన రైతుకు అందేలా చూడాలని బీజేపీ నాయకులు బుధవారం తహశీల్దార్ వెంకట్రావుకు వినతి పత్రం అందజేశారు. మండలంలోని రైతులందరికి రుణమాఫీకి ఎలాంటి ఆంక్షలు లేకుండా వర్తించేలా చూడాలని కోరారు. అలాగే రైతులందరికి పెట్టుబడి సహాయం కోసం రైతుభరోసా వెంటనే అందించాలని ఎంఆర్‌వోను కోరినట్లు బీజేపీ మండల అధ్యక్షుడు నాయుడు రాజన్న తెలిపారు. అనంతరం కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేసుకొని త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలని అందుకోసం కార్యచరణ రూపొందించాలని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు బూత్ స్థాయి నుంచి కార్యకర్తలను సమాయత్తం చేసి కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలని కార్యకర్తలను కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు శ్రావణ్, శేఖర్, జల్లెల శ్రీనివాస్, రాజలింగం, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

ఘనంగా డీఎస్ సంస్మరణ సభ



డీఎస్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

నిజామాబాద్ అర్బన్, జూలై 31: దివంగత నేత, పీసీసీ మాజీ అధ్యక్షుడు డి.శ్రీనివాస్ సంస్మరణ సభను బుధవారం నగరంలోని ప్రగతినగర్ మున్నూరుకాపు కళ్యాణ మండపంలో ఘనంగా నిర్వహించారు.ఈసందర్భంగా డీఎస్ చిత్రపటానికి మున్నూరుకాపు సంఘం ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. డీఎస్ తనయుడు, మాజీ మేయర్ సంజయ్, డీఎస్ సోదరుడు ప్రకాశ్ తదితరులు ఈకార్యక్రమంలో పాల్గొనగా జిల్లా మున్నూరుకాపు సంఘం ప్రధాన కార్యదర్శి దారంసాయిలు మాట్లాడుతూమున్నూరుకాపు ఐక్యత కోసం డీఎస్ ఎంతో కృషి చేశారని ఆయన హయాంలోనే మున్నూరుకాపులు రాష్ట్రంలో ప్రత్యేక గుర్తింపును పొందారని అన్నారు. ప్రగతినగర్ మున్నూరుకాపు స్థలాన్ని, అదేవిధంగా న్యాల్‌కల్ రోడ్‌లో ఉన్న మున్నూరుకాపు కల్యాణ మండపానికి ప్రభుత్వం ద్వారా తక్కువ ధరకు స్థలాన్ని ఇప్పించి వాటి నిర్మాణానికి కూడా డీఎస్ నిధులు ఇచ్చారని అన్నారు. 1989లో ఎమ్మెల్యేగా డీఎస్ గెలుపుకు మున్నూరుకాపులంతా ఐక్యంగా పనిచేశారని, డీఎస్ ఎక్కడికి వెళ్లిన తాను మున్నూరుకాపునని గర్వంగా చెప్పుకునేవారు అని అన్నారు. నగరంలో మున్నూరుకాపు సంఘాలతో పాటు ఇతర కుల సంఘాలకు భవనాలు నిర్మించిన ఘనత డీఎస్‌దేనన్నారు. నిజామాబాద్ ఎమ్మెల్యేగా, ఉమ్మడి రాష్ట్రంలో రెండు సార్లు పీసీసీ అధ్యక్షుడిగా, మంత్రిగా డీఎస్‌నగరంలో అనేక అభివృద్ధి పనులు చేపట్టారని అన్నారు. నిజామాబాద్‌ను మున్సిపాలిటీ నుంచి నగర పాలక సంస్థగా మార్చి నగరంలో డ్రైనేజీ, రోడ్ల అభివృద్ధి చేశారని అదేవిధంగా అలీసాగర్ నుంచి మంచినీటి కొరకు నూతనంగా పైప్‌లైన్ ఏర్పాటు చేసిన ఘనత డీఎస్‌దన్నారు. నగరంలోని 21 మున్నూరుకాపు సంఘాలను ఏకతాటిపై తీసుకొచ్చి అందులో ఉన్న120 తర్పలకు డీఎస్ సహాయ సహకారాలు అందించారనిఅన్నారు.డీఎస్‌ను ఎప్పుడూ మరవవద్దని రుణపడిఉంటామన్నారు.ఈకార్యక్రమంలో మున్నూరుకాపు బాలవర్తి,శరత్, రాజేశ్వర్, ప్రవీణ్,అజ్జన్ ప్రకాశ్,గంగాధర్,తోటరాజశేఖర్, ఉన్నారు.

రెచ్చిపోతున్న సైబర్ నేరగాళ్లు

● ఒక వైపు బెదిరింపులు -మరో వైపు ఖాతాలు ఖాళీ ● అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీసులు

ఖిల్లా, జూలై, 31 : జిల్లాలో రోజు రోజుకు సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయి. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఒక వైపు పోలీసులు సూచిస్తున్నప్పటికి నేరగాళ్ల బెదిరింపులు సైతం అదే తరహా ఉంటున్నాయి. సైబర్ నేరగాళ్ల బెదిరింపుల వల్ల సామాన్య ప్రజల ఖాతాలు ఖాళీ అవుతున్నాయి. సైబర్ నేరగాళ్ల వలలో పడకుండా ఉండేందుకు ప్రజలు పోలీసు శాఖ సూచనలు పాటించాలని, అప్రమత్తంగా ఉండాలని నిజామాబాద్ ఏసీపీ రాజావెంకటరెడ్డి తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తుల నుంచి వచ్చిన లింకులపై పూర్తిగా అవగాహన వచ్చిన తర్వాతనే వాటిని ఓపెన్ చేయాలని తెలిపారు.

● సెల్‌ఫోన్‌లోని లింకులు ఓపెన్ చేసే ముందు జాగ్రత్తలు ఇవి.....

సెల్‌పోన్‌కు వచ్చే లింకులను పూర్తిగా నిర్దారించుకున్న తరువాతనే వాటిని ఓపెన్ చేసుకోవాలి, డిజిటల్ చెల్లింపులు, బ్యాంకు ఖాతాల్లో నగదు తక్కువగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. గూగుల్‌లో సెర్చ్ చేసే సమయంలో అప్రమత్తంగా వ్యవహరించాలి. గుర్తు తెలియని ఫోన్ నంబర్ల నుంచి లేదా వ్యక్తుల నుంచి వచ్చే మేసేజ్‌లు, ఫోన్‌లను లిఫ్ట్ చేయరాదు, బ్యాంకు వివవరాలు ఎట్టి పరిస్థితుల్లో ఇవ్వరాదు,ముఖ్యంగా ఓటిపి, ఆధార్‌నంబర్, పాన్‌కార్డు వివరాలను చెప్పారాదు, సైబర్ నేరాలకు గురైన వారు వెంటనే 1930కు కాల్ చేయాలి, సైబర్ మోసానికి గురైన గంటలోపు ఫిర్యాదు చేస్తే సైబర్ పోలీసులు ఆ లింక్ ద్వారా బ్యాంకు ఖాతాలను ఫ్రీజ్ చేసే అవకాశం ఉంటుంది. జిఆల్లలోని పోలీసు స్టేషన్‌లలో రైతుకు రూ.1000నుంచి రూ.7లక్షల వరకు మోసాలకు సంబంధించిన ఫిర్యాదులు చేయాలి, ఆపై మోసాలకు సంబంధించినఫిర్యాదులను సైబర్‌క్రైమ్ పోలీసులకు చేయాలి.

డిచ్‌పల్లి: అమాయక ప్రజలను ఆసరా చేసు కొని ఉపాధి కోసం గల్ఫ్ వెళ్లిన కుటుంబ సభ్యుల ను వాట్సాస్ ప్రొఫైల్ పోలీస్ అధికారి డీపీ పెట్టు కొని వాట్సప్ కాల్ ద్వార పోలీసు వారిమని, డ్రగ్స్ కేసులో ఇరుక్కున్నరని గల్ఫ్ దేశాల్లో కూడా నేరం చేసిన వారిని అరెస్ట్ చేయబడ్డారని నమ్మించి ఫోన్ ద్వార డబ్బులు పంపాలని వారిని విడిచి పెడుతా యని బెదిరింపులు చేస్తున్నరని ప్రజలు భయం దోళనకు గురి అవుతున్నారని, అటువంటి ఫేక్ కాల్స్ కు రెస్పండ్ కావొద్దని ఎస్సై మహేశ్ సూచిం చారు. బుధవారం సాయంత్రం ఆయన డిచ్‌పల్లి ఠా ణాలో విలేకర్లతో మాట్లాడారు. రెండు రోజుల క్రితం పడకల్ గ్రామానిక చెందిన ఓ వ్యక్తికి ఫోన్‌చేసి మీకొడుకు తమ ఆదినంలో ఉన్న మని బెదిరించడతో మూడు దఫాలుగా రూ.95వేల సైబర్ నేరగాళ్ల మోసం చేశారు.పోలీసు ఫోటోలతో తాము పోలీసులమని చెప్పి వాట్సప్ ద్వార ఫొన్ చేసి డబ్బులు పంపమని చెబితే పంపొద్దని సీఐ సూచిం చారు. దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని, ఓటీపీలను కూడా షేర్ చేయవద్దని సూచించారు.



మాట్లాడుతున్న ఎస్సై

● సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

నవీపేట: సైబర్ నేరాల పట్ల ప్రతీ ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ యాదగిరి గౌడ్ కోరారు. ఇటీవల మండలంలోని పలు గ్రామాలకు చెందిన పలువురికి సైబర్ నేరగాళ్ల ఫోన్‌లు చేసి డబ్బులు డిమాండ్ చేసినట్లు తమ దృష్టికి వచ్చిందని అన్నారు.

ముప్కాల్:బాల్కొండ మండల కేంద్రంలోని మసీదు వద్ద సైబర్ నేరాలపై పోలీస్ శాఖ ఆధ్వర్యంలో బుధవారం ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రస్తుతం సీబీఐ నెంబర్ అని ఎక్కువ సార్లు ఫోన్‌లు వస్తున్నాయని అటువంటి నెంబర్లను గుర్తించి అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు ఈ కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ జయంతరావు, కానిస్టేబుళ్ల తదితరులు పాల్గొన్నారు.

మోదీ సర్కార్ కార్పొరేట్ సంస్థలకు వత్తాసు



నినాదాలు చేస్తున్న కిసాన్ మోర్చ రాష్ట్ర నాయకులు

పెద్దబజార్, జూలై 31: మోదీ సర్కార్ కార్పొరేట్ సంస్థలకు వత్తాసు పలుకుతూ చేసి బడ్జెట్ కేటాయించారని సంయుక్త కిసాన్ మోర్చ రాష్ట్ర నాయకులు అన్నారు. బుధవారం నగరంలోని ధర్నాచౌక్ వద్ద బడ్జెట్ పత్రాలను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్నం పెడుతున్న రైతును తుంగలోకి తొక్కి రైతు పోరాటానికి ఇచ్చిన హామీలను విస్మరించిందన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించకుండా డాక్టర్ స్వామినాథన్ కమీషన్ సిఫారసులను అమలు చేయకుండా రైతుల పంటలకు నామమాత్రం ధరలు పెంచి సంబరాలు చేసుకోవాలని తెలిపిందన్నారు.ఇప్పటికైనా మోదీ సర్కార్ స్వామినాథన్ సిఫార్సులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు కంజర భూమయ్య, పెద్దివెంకట్రాములు, సాయాగౌడ్, గంగారాం,సురేష్, రమేష్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

● కార్పొరేట్‌లకు, ధనవంతులకు అనుకూలంగా ఉంది

ప్రభుత్వం ప్రతిపాదించిన బడ్జెట్ కార్పొరేట్‌లకు, ధనవంతులకు అనుకూలంగా ఉందని మధ్యతరగతిని పూర్తిగా విస్మరించిందని ఇన్సూరెన్స్ ఉద్యో గుల జాతీయ నాయకులు కేవీఎస్ఎన్ రాజు అన్నారు. బుధవారం నగరంలోని మల్లుస్వరాజ్యం ట్రస్టు భవనంలో కేంద్ర బడ్జెట్ మధ్యతరగతిపై సెమినార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ విధానాల మూలంగా కోట్లు సంపాదించే పన్ను చెల్లించగలిగిన వారికి రాయితీలు బడుగు బలహీన వర్గాల వారికి మధ్యతరగతి వారి నుంచి మాత్రం ముక్కు పిండి పన్నులను వసూలు చేస్తున్నారని అన్నారు.

నేడు నగరంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం

సుభాష్‌నగర్, జూలై 31: నగరంలోని దుబ్బ ఉపకేంద్రం పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని టౌన్-2 ఏడీఈ తోటరాజశేఖర్ తెలిపారు. ఏబీ స్విచ్‌లు మార్చడానికి మధ్యాహ్నం 3గంటల నుంచి 5.30ల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు. దుబ్బ సబ్ స్టేషన్ పరిధిలోని గౌతంనగర్, పెద్దమ్మటెంపుల్, జీజీకాలేజీ, జన్మభూమిరోడ్, ఎన్‌జీవోస్ కాలనీ, అరుంధతినగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. ఉదయం 10గంటల నుంచి 12.30ల వరకు గౌతంనగర్ ఆటోస్టాండ్, జన్మభూమి రోడ్, తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు. వర్షం కురిస్తే విద్యుత్ సరఫరా యదావిధిగా ఉంటుందని వినియోగదారులు గమనించాలని కోరారు.

వన మహోత్సవంలో భాగంగా మొక్కల పంపిణీ

ఇందల్వాయి, జూలై 31: వన మహోత్సవంలో భాగంగా బుధవారం ఇందల్వాయి మండలంలోని సిర్నాపల్లి గ్రామ పంచాయతీలో ఇంటింటికి మొక్కలను పంపిణీ చేసినట్లు ఎంపీడీవో అనంత్‌రావు తెలిపారు. ప్రతీ ఒక్కరు ప్రభుత్వ ఆదేశాల మేరకు మొక్కలను నాటివాటిని సంరక్షించాలని ఆయన అన్నారు. అనంతరం గ్రామ పంచాయతీలో విధులు నిర్వహిస్తున్న గ్రామ పంచాయతీ సిబ్బందికి రెయిన్ కోర్టులను అందించారు. కార్యక్రమంలో ఆయనతో పాటు ఏఈ దీప్‌చంద్, పంచాయతీ కార్యదర్శి సదానంద్, మహిళా సంఘాల సభ్యులు, తదితరులు ఉన్నారు.

2న ఉద్యోగమేళా

పెద్దబజార్, జూలై 31: ప్రైవేటు రంగంలో ఉద్యోగులకు ఆగస్టు 2న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి కె.లక్ష్మణ్‌కుమార్ తెలిపారు. ముత్తూట్ గ్రూప్, ధరణి ఇన్‌ఫ్రా హైదరాబాద్ కంపెనీల ఆధ్వర్యంలో ప్రొబేషనరీ ఆఫీసర్, ఇంటర్‌షిప్ ట్రైనీ, సేల్స్ ఎగ్జిక్యూటీవ్ ఉద్యోగులకు ఇంటర్వ్యూలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఇంటర్, డిగ్రీ, బీటెక్ ఉత్తీర్ణులైన వారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తిగల వారు ఉదయం 10.30లకు జిల్లా కేంద్రంలోని ఉపాధి కల్పన శాఖ కార్యాలయంలో సంప్రదించాలని అన్నారు. అభ్యర్థులు బయోడేటా, ఆధార్‌కార్డు, ఎస్సెస్సీ మెమో, పాస్‌పోర్టు సైజ్ ఫోటోలతో హాజరుకావాలన్నారు. జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 9581768413, 9948748428 నెంబర్లను సంప్రదించాలని అన్నారు.

63 జాతీయ రహదారి నిర్మాణానికి రైతులు సహకరించాలి

● బాధిత రైతులకు తగు విధంగా న్యాయంజరిగేలా చూస్తాం: ఆర్మూర్ ఆర్డీవో



కమ్మర్‌పల్లి రైతువేదికలో స్థానిక రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో రాజాగౌడ్

కమ్మర్‌పల్లి, జూలై 31: పెర్కిట్ నుంచి మంచిర్యాల సెక్షన్ వరకు ఎన్‌హెచ్ ఆర్ 63 రహదారి ఆదునికరణలో భాగంగా బైపాస్ రోడ్డు నిర్మాణానికి రైతులు సహకరించాలని, భూముల కోల్పోతున్న బాధిత రైతులకు తగు విధమైన నష్టపరిహారం అం దేలా చూస్తామని ఆర్మూర్ ఆర్డీవో రాజగౌడ్ అన్నారు. బుధవారం కమ్మర్‌పల్లి రైతువేదిక భవనంలో బాధిత రైతులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేసి మాట్లాడారు. కమ్మర్‌పల్లి గ్రామశివారులమీదుగా బైపాస్ రోడ్డు నిర్మాణం జరుతున్నదని దీనికోసం రైతుల నుంచి సేకరించిన భూములకు సంబంధించి నష్టరిహారం విషయమై తగువిధంగా న్యాయం జరిగేలా చూస్తామన్నారు. ఈ సందర్భంగా స్థానిక, బాధిత రైతులు మాట్లాడుతూ.. ఇదివకే వరద కాలువ, రైల్వే లైన్ల నిర్మాణాలనిమిత్తం తమ విలువైన వ్యవసాయభూములు కోల్పొయామని, ఎక్కువధరలకు ఎక్కడో చోట భూముల కొని వ్యవసాయం చేసుకుంటుంటే ఇప్పటు నేషనల్ హైవేఅటుకోట్ల విలువచేసే భూము లు మరోమారు కోల్పోవలసివస్తుందని ప్రభుత్వం మాత్ర నామమాత్రంగా నష్టపరిహారం అందించి చేతులు దులుపుకుంటే తమకు వ్యవసాయ భూములు ఎక్కడ దొరుకుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బాధిత రైతుల విజ్ఞప్తులను ఆర్డీవో స్వీకరించారు. రైతులు భూకొలతలకు వ్యత్యాసం విషయంలో, ఎంజయ్‌మెంట్ సంబంధిత విషయాల్లో రైతుల విజ్ఞప్తులను తీసుకున్నారు. బాధిత రైతులకు ఢిల్లీ నుండే నేరుగా నష్టపరిహారం రైతుల ఖాతాల్లోకి జమ అవుతాయాన్నరు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అంజనేయులు, ఎంపీడీవో రాజా శ్రీనివాస్,ఆర్ఐశరత్,అడి షనల్ ఆర్ఐ గంగారాం, సర్వేయర్ బాలకృష్ణ గ్రామా బాధిత రైతులు రెంజర్ల గంగా రాం, సుంకెట బుచ్చన్న, సుంకెట రాములు, శ్రీకాంత్ గడ్డం స్వామి, సుంకరి నవీన్, రఘు, గంగాధర్, కొమ్ముల మహిపాల్, మహిళ రైతులు, తదితరు పాల్గొన్నారు.

రాష్ట్ర బడ్జెట్ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేలా ఉంది



టీయూలో మాట్లాడుతున్న రిజిస్ట్రార్ యాదగిరి

డిచ్‌పల్లి,జూలై 31: రాష్ట్ర బడ్జెట్ ఆర్థిక వ్యవస్థను, ప్రజల జీవితాలను ప్రభావితం చేసే అంశాల్లో ప్రధానమైనదిగా ఉందని, ఈ బడ్జెట్ లో ధరల స్థిరత్వం అంతర్జాతీయ చెల్లింపుల సమతుల్యతలు ప్రధాన లక్ష్యాలు గా ఉన్నాయని టీయూ రిజిస్ట్రార్ ప్రొ.యాదగిరి అన్నారు. బుధవారం కామర్స్ విభాగం డీన్ ప్రొ.రాంబాబు ఆధ్వర్యంలో ఒపేన్ హౌజ్ ఆన్ యూనియన్ స్టేట్ బడ్జెట్ -2024పై ప్రత్యేక చర్చ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రిజిస్ట్రార్ మాట్లాడుతూ.. కేంద్ర బడ్జెట్ వికాసిత భారత్ లక్ష్యానికి రోడ్డు మ్యాపుల ఉందని యువకులు, మహిళలు, పేదలు, వ్యవసాయానికి ప్రధానంగా నిధులు కేటాయింపులు జరిగయన్నారు. ప్రిన్సిపాల్ ఆరతి మాట్లాడుతూ..నిరుద్యోగం పేదరికం, ధరల పెరుగుదలను అరికట్టి ఆర్థిక అసమానాతలు తగ్గించేందుకు ఈబడ్జెట్ తోడ్పాడుతందన్నారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ రాంబాబు, న్యాయ నిర్ణేతలుగా ప్రొ.అంజనేయులు, సంపత్ కుమార్, పున్నయ్య, లు వ్యవహరించారు.ఈకార్యక్రమంలో అపర్ణ, కైసర్ మహమ్మద్, శ్రీనివాస్, దత్తహరి, గంగాదర్, శ్రీనివాస్, శ్వేతా, సబితా, కిరణ్ రాథోడ్, విద్యార్థులు పాల్గొన్నారు.

టీయూ కళాశాల ఎదుట నిరసన



టీయూలో ఆందోళన చేస్తున్న బీజేవైఎం నాయకులు

డిచ్‌పల్లి,జూలై 31: తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ లో యూనివర్సిటీలకు జరిగిన అన్యాయం పై భారతీయ జనతా యువ మోర్చా బీజేవైఎం ఆధ్వర్యంలో ప్లకార్డలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జిల్లా బీజేవైఎం ఉపాధ్యక్షుడు పిల్లి శ్రీకాంత్ మాట్లాడుతూ.. తెలంగాణ పేరుతో ఉన్న వర్సిటీ ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడం సిగ్గు చేటు అన్నారు. టీయూ కి సీఎం రేవంత్‌రెడ్డి గతంలో అనేక సార్లు మంత్రులు పట్టించుకోవడం లేదని విమర్శించిన రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత నిధులు కేటాయించకపోవడం తగదన్నారు. ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు చేస్తామని చెప్పి ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడం అర్థరహితమన్నారు. బడ్జెట్ జీతాలకు మాత్రమే సరిపోతుందని దీని ద్వార వర్సిటీ అభివృద్ధి ఏలా సాధ్యమన్నారు. వర్సిటీకి వీసీ, అధ్యాపకులు పూర్తిస్థాయిలో లేక అభివృద్ధి కుంటు పడుతుందన్నారు. ఇంజనీరింగ్ కళాశాల టీయూలో ఏర్పాటు చేయలన్నారు. లేనిచో ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ నిరసన కార్య క్రమంలో నాయకులుసాయి తరుణ్, సంజయ్, శ్రీకాంత్, రియజ్, అజారుద్దిన్, హరిశ్, పాల్గొన్నారు.

డిగ్రీ వన్‌టైం పరీక్షల్లో ప్రశాంతం

డిచ్‌పల్లి,జూలై 31: తెలంగాణ విశ్వవిద్యాలయ పరిధిలోని డిగ్రీ బ్యాక్‌లగ్ వన్‌టైం పరీక్షలు మంబుధ వారం 27వరోజు ప్రశాంతంగా జరిగినట్లు ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొ.ఘంట చంద్రశేఖర్ తెలిపారు. అనుబంధ కళాశాల పరిధిలో ఉదయం జరిగిన పరీక్షకు 6గురు విద్యార్థులకు గాను 5మంది హాజరయ్యారని, ఒక విద్యార్థి గైర్హాజరని ఆడిట్ సెల్ డైరెక్టర్ ఆయన తెలిపారు.

భారీ వర్షాలతో కూలిన ఇళ్లు



ఇందల్వాయి- భారీ వర్షానికి కూలిన ఇళ్లు

ఇందల్వాయి, జూలై 31: మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ఇందల్వాయి మండలంలోని చంద్రయాన్‌పల్లి గ్రామంలోని ఎస్సీ కాలనీలో సంగెం రామ్‌లక్ష్మణ్‌లకు చెందిన నివాసపు ఇళ్లు కూలిందని స్థానికులు తెలిపారు. నిరుపేద కుటుంబానికి చెందిన వీరి ఇళ్లు కూలిపోవడంతో వారు నిరాశ్రులయ్యారని వారిని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

చికెన్ ధరలు





రకం	: లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	: రూ.100	రూ.220	రూ. 240
వెన్‌కాబ్(కిలో)	: రూ.105	రూ.225	రూ. 245

బంగారం ధరలు



బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.72300	రూ.66,700	రూ.880

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : డెడ్‌పూల్ (తెలుగు 3డీ) (10.15, 1.15)
: డెడ్‌పూల్ (ఇంగ్లీష్ 3డీ) (4.15, 7.15, 10.15)

స్క్రీన్-2 : కల్కి (3డీ తెలుగు) (11.20, 6.15)
: రాయాన్ (3.05, 10.00)

స్క్రీన్-3 : శివం భజే (11.30, 2.15, 5.00, 7.45, 10.30)

స్క్రీన్-4 : బ్యాడ్ న్యూజ్ (హిందీ) (10.10, 1.15)
: ట్విస్టర్స్ (ఇంగ్లీష్) (4.20)
: పురుషోత్తముడు (10.20)
: రాయన్ (7.10)



ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : కల్కి(10.40)
: రాయన్ (1.55, 4.50, 10.35)
: శివం భజే (7.45)

స్క్రీన్-2 : శివం భజే (11.00, 4.50, 10.35)
: కల్కి(తెలుగు) (1.35, 7.20)

స్క్రీన్-3: డెడ్‌పూల్ (తెలుగు 3డీ) (11.05, 1.45, 7.45)
: కల్కి(4.20, 10.20)

దేవి : రాయన్ (11.15, 2.15, 6.15, 9.15)

నటరాజ్: డెడ్‌పూల్ (తెలుగు) (11.15, 2.15, 6.15, 9.15)

విజయ్ : కల్కి (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్